
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

శనివారం 8 జూన్ 2024

డిగ్రీ పరీక్షలో ఐదుగురు విద్యార్థుల డిబార్

రామాయంపేట, జూన్ 7: రామాయంపేటలో శుక్రవారం జరిగిన డిగ్రీ పరీక్షలో ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. తెలంగాణ సాంఘీక సంక్షేమ డిగ్రీ కళాశాల సెంటర్‌లో 246 మంది బాలురు తృతీయ సంవత్సరం పరీక్షలు రాశారు. పరీక్ష పరిశీలకుడిగా వచ్చిన కాపీ కొడుతున్నారని ఐదుగురు విద్యార్థులను డిబార్ చేశారు. దీంతో ఆగ్రహించిన తోటి విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు పరీక్ష కేంద్రానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

ఫైళ్లు ఇక.. చకచకా..!

ముగిసిన ఎన్నికల కోడ్.. రోజువారీ విధుల్లోకి అధికారులు

- రెవెన్యూశాఖలో పేరుకుపోయిన ఫైళ్లు
- ఇకనైనా పనులు జరుగుతాయని ప్రజల ఆశాభావం
- సమష్టి కృషితోనే ఎన్నికలు విజయవంతం : కలెక్టర్



మెదక్ అర్బన్, జూన్ 7: పార్లమెంట్ ఎన్నికల క్రతువు పూర్తయింది. ఎన్నికల కోడ్ ముగిసింది. షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి మూడు నెలలుగా జిల్లా అధికార యంత్రాంగం మొత్తం ఎన్నికల విధుల్లో నిమగ్నమైంది. పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఫలితాల వెల్లడితో ఎన్నికల ప్రక్రియ ముగియడంతో అన్నిశాఖల అధికారులు రోజువారీ విధులకు హాజరవుతున్నారు. ఎన్నికల విధుల్లో 25 శాఖలకుపైగా ఉద్యోగులు పాలుపంచుకున్నా రెవెన్యూ శాఖదే కీలకపాత్ర. ఓటరు నమోదు నుంచి పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు వరకు ఆ శాఖ నేతృత్వంలోనే జరిగాయి. దీంతో క్షేత్రస్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశం లేక దస్త్రాలు పేరుకుపోయాయి. వారం రోజుల్లో విద్యాసంస్థలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులు కుల, ఆదాయ, ఇతర ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమవడంతో ధ్రువప్రతాల జారీలో జాప్యం జరిగింది. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఇక పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరించే అవకాశముంది.

యథాతథంగా ప్రజావాణి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి నిలిపివేశారు. అధికార యంత్రాంగమంతా ఎన్నికల విధుల్లో ఉండడంతో దాదాపు 3 నెలలుగా ప్రజావాణి నిర్వహించలేదు. దీంతో ప్రజా సమస్యలు పేరుకుపోయాయి. కోడ్ ముగియడంతో వచ్చే సోమవారం (ఈ నెల 10) నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించనున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. చాలా రోజుల తర్వాత ప్రజావాణి నిర్వహిస్తుండడంతో ప్రజల నుంచి పెద్ద ఎత్తున అర్జీలు అందే అవకాశముంది.

అందరి కృషితోనే ఎన్నికలు విజయవంతం : కలెక్టర్

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుంచి ఫలితాలు వెలువడి ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం... ప్రజలు, పార్టీలు సహకరించడంతోనే ఎన్నికలు విజయవంతంగా పూర్తిచేశామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజలు చైతన్యం చాటారని కొనియాడారు. గత పార్లమెంట్ ఎన్నికల కంటే ఈసారి అధికంగా పోలింగ్ శాతం నమోదైందని గుర్తుచేశారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, ప్రజలు, వివిధ వర్గాలను కలెక్టర్ అభినందించారు.

సీఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే



జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి ఎంపీగా విజయం సాధించిన సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

-నారాయణఖేడ్



అటవీ విస్తీర్ణాన్ని పెంచాలన్న లక్ష్యంతో చేపట్టిన హరితహారం కార్యక్రమం పదో విడత విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. ఇప్పటికే నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో మొక్కలు నాటేలా జిల్లా గ్రామాభివృద్ధిశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లావ్యాప్తంగా 38 లక్షల మొక్కలు పెంచడమే లక్ష్యంగా నిర్దేశించుకుని, ఇందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నది. ఇప్పటికే తొలకరి పలుకరించడంతో గుంతల తవ్వకాలను చేపట్టారు. వర్షాలు రాగానే మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

పదో విడత లక్ష్యం 38 లక్షలు

- హరితహారానికి సన్నాహాలు
- 639 పంచాయతీల్లో మొక్కల పెంపకం
- ప్రతీ గ్రామంలో 2,700.. మున్సిపాలిటీల్లో 6.30 లక్షలు
- శాఖలవారీగా కార్యాచరణ.. సిద్ధంగా మొక్కలు

సంగారెడ్డి టౌన్, జూన్ 7 : సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు ఉండగా.. 639 పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలవుతున్నది. ఈ పథకం కింద ఊరూరా వన నర్సరీల్లో మొక్కల పెంచుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈసారి హరితహారంలో 38 లక్షల మొక్కలు నాటాలని కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం గతేడాదికి సంబంధించిన 19 లక్షల మొక్కలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయి. మిగిలినవి ఈ ఏడాది నర్సరీల్లో పెంచుతున్నారు. మొక్కలు నాటడానికి అవసరమైన గుంతలను ఇప్పటికే ఈజీఎస్‌లో భాగంగా తవ్వించారు. వర్షాలు పడగానే మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రతీ పంచాయతీలో 2,700 మొక్కలు

జిల్లాలోని ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో 2,700 మొక్కలను నాటాలని నిర్ణయించారు. వీటితోపాటు ఇంటింటికీ ఆరు రకాల మొక్కలు పంపిణీ చేయనున్నారు. గతంలో నాటిన మొక్కల సంరక్షణపైనా దృష్టి సారించనున్నారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, కాల్వలు, గట్టు ప్రాంతాలు, నీటి వనరులపైన, ఇతర ఖాళీ స్థలాల్లో, రైతులకు అవసరం ఉన్నచోట మొక్కలు నాటాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం 20 రకాలకుపైగా మొక్కలను పెంచుతున్నారు. చింత, అల్లనేరేడు, కరివేపాకు, కానుగ, దానిమ్మ, బొప్పాయి, రావి, గంగరావి, మర్రి, గుల్‌మోహర్, గులాబీ, గన్నేరు, కాగితంపూలు, జామ, మామిడి తదితర మొక్కలను ఇప్పటికే సిద్ధం చేశారు.

శాఖలవారీగా టార్గెట్లు

హరితహారం విజయవంతం చేయడానికి అధికార యంత్రాంగం ప్రభుత్వ శాఖలవారీగా లక్ష్యాలను నిర్దేశించింది. డీఆర్‌డీవో ద్వారా 20 లక్షలు, అటవీశాఖ 2.40 లక్షలు, ఉద్యానవన శాఖ, టీఎస్ ఐసీసీ జాతీయ రహదారుల శాఖలు లక్ష చొప్పున, పోలీసుశాఖ 25వేల మొక్కలు నాటాలని నిర్ణయించారు. అలాగే, జిల్లాలోని మున్సిపాలిటీలో 6.30 లక్షల మొక్కలు నాటాలని సంకల్పించారు. అందోలులో 50వేలు, ఐడీఏ బొల్లారంలో 60వేలు, నారాయణఖేడ్‌లో 40వేలు, సదాశివపేటలో 60వేలు, అమీన్‌పూర్, సంగారెడ్డి, తెల్లాపూర్, జహీరాబాద్ బల్దియాల పరిధిలో లక్ష చొప్పున మొక్కలు నాటాలని నిర్ణయించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పకడ్బందీగా ఇంటింటి సర్వే

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 7: మిషన్ భగీరథ మంచినీటి కనెక్షన్లపై ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో పనిచేస్తున్న ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరిగిన కుటుంబ సభ్యుల సంఖ్య, అవసరాల ఆధారంగా తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన వివరాల సేకరణ కోసం జిల్లాలో పది రోజుల పాటు సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. తాగునీటి కనెక్షన్లు, కుటుంబ సభ్యుల వివరాలు, నీటి అవసరాల వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. జనాభా 400 కంటే తక్కువ ఉన్న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సర్వే చేయాలని, ఎక్కువ జనాభా ఉంటే సెక్రటరీతోపాటు అంగన్‌వాడీటీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, మిషన్ భగీరథ ఈఈ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అందోలులో నర్సింగ్ కళాశాల

- భవనాలు, వసతుల కోసం రూ.43 కోట్లు
- ఈ విద్యా సంవత్సరమే కోర్సు ప్రారంభం
- మాట నిలబెట్టుకున్న మంత్రి దామోదర్



జోగిపేట, జూన్ 7: అందోలు పట్టణంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బీఎస్సీ (నర్సింగ్) కళాశాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. అందోలు పట్టణంలోని ప్రభుత్వ భూమిలో కళాశాల ఏర్పాటుకు అనుమతిస్తూ.. భవనాలు, సదుపాయాలు, ఫర్నిచర్ కోసం రూ. 43 కోట్లను విడుదల చేసింది. దీంతో, వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు అనుబంధంగా ఈ సంవత్సరం నుంచే నాలుగేళ్ల కోర్సు ప్రారంభం కానుంది. ఈ కళాశాలలో 60 మంది విద్యార్థులు ప్రవేశం పొందుతారు. బీఎస్సీ నర్సింగ్ కళాశాల మంజూరు చేయడం పట్ల నియోజకవర్గ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చెప్పినట్టే ఆరు నెలల్లోనే కాలేజీని ఏర్పాటు చేయించి మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. మంత్రి, సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రూప్-1 పరీక్షకు కట్టుదిట్టమైన భద్రత

- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్



సమావేశంలో మాట్లాడుతున్న రూపేశ్

సంగారెడ్డి రూరల్, జూన్ 7 : జిల్లాలో గ్రూప్-1 ప్రిమిలినరీ పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. పరీక్ష ఏర్పాట్లపై శుక్రవారం ఆయన సంగారెడ్డిలోని ఎస్పీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 9న గ్రూప్-1 ప్రిమిలినరీ పరీక్షలు జిల్లాలో 16 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నారని తెలిపారు. 9,672 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్‌షాపులను మూసివేయాలని యజమానులకు ఎస్పీ సూచించారు. ఉదయం 10 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని, ఎవరైనా మాల్‌ప్రాక్టీస్, కాపియింగ్‌కు పాల్పడినట్టు తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పకడ్బందీగా నిర్వహించాలి

సంగారెడ్డి జిల్లాలో గ్రూప్-1 ప్రిమిలినరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసిన అనంతరమే లోపలికి అనుమతించాలని సూచించారు. తనిఖీ బృందాలు పరీక్ష నిర్వహించే ప్రతీ కేంద్రాన్ని పరిశీలించాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షకు హాల్‌టికెట్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఏదైనా గుర్తింపుకార్డును తప్పనిసరిగా తీసుకువెళ్లాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని స్పష్టం చేశారు.

మెదక్ జిల్లాలో 10 కేంద్రాలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్, జూన్ 7: జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్ష నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 3,926 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మెదక్), సిద్దార్థ్ జూనియర్ కళాశాల(మెదక్), సిద్దార్థ మోడల్ స్కూల్(వెంకట్‌రావ్‌నగర్ మెదక్), ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల(మెదక్), గీతా ఉన్నత పాఠశాల(మంబోజిపల్లి, మెదక్), గీతా జూనియర్ కళాశాల(అజంపుర, మెదక్), గీతా హై స్కూల్(వీరహనుమాన్ కాలనీ మెదక్), బీవీఆర్‌ఐటీ ఆర్యాబట్టు బ్లాక్(నర్సాపూర్), బీవీఆర్‌ఐటీ అబ్దుల్‌కలాం బ్లాక్(నర్సాపూర్), బీవీఆర్‌ఐటీ విశ్వేశ్వరయ్య బ్లాక్(నర్సాపూర్)లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్నపత్రాల పంపిణీ జరగాలని, అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో పద్మశ్రీ, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతినిధి రోహిత్ పాల్గొన్నారు.



హత్నూరలో చిరుత కలకలం

- భయాందోళనలో స్థానికులు

హత్నూర, జూన్ 7: మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని మల్లన్నగుట్ట వద్ద చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం బ్రాహ్మణగూడ గ్రామానికి చెందిన వ్యక్తి గుట్ట సమీపంలో నుంచి గ్రామానికి వెళ్తుండగా.. చిరుత కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. వెంటనే గ్రామానికి చేరుకొని స్థానికులకు సమాచారం అందజేశారు. చుట్టుపక్కల గ్రామాలు, పోలీసులు, అటవీశాఖకు సమాచారం ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లడానికి జంకుతున్నారు.

పిడుగుపాటుకు మరో ఇద్దరు రైతులు..

- రాజ్‌పల్లిలో ఒకరు, చిట్కుల్‌లో ఒకరు మృతి



సిద్దిరాములు(ఫైల్)

మెదక్ అర్బన్/చిలప్‌చెడ్, జూన్ 7: పిడుగుపాటుకు ఇద్దరు రైతులు మృతిచెందారు. మెదక్ మండల పరిధిలోని రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మార్గం సిద్దిరాములు(55) తన భార్య రాధమ్మ, మరదలు నవనీతతో కలిసి పొలంలో పని చేసుకుని ఇంటికి వస్తున్నారు. ఇంతలోనే ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. వర్షం తాకిడి నుంచి రక్షణ కోసం చెట్టు కింద నిలబడగా చెట్టుపైనే పిడడంతో సిద్దిరాములు మృతి చెందాడు. మృతుడి భార్య రాధమ్మ, నవనీత తీవ్రంగా గాయపడడంతో చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు.

చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిడుగు పడడంతో ఒకరు మృతిచెందారు. చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిట్కుల్ గ్రామానికి చెందిన బోయిని నర్సమ్మ(52), భర్త ఎల్లయ్యతో కలసి వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామ శివారులోని పంట పొలాల్లో వారు పనిచేసుకుంటుండగా పిడుగు పడడంతో నర్సమ్మ అక్కడికక్కడే మృతిచెందారు.



రోదిస్తున్న మహిళ కుటుంబ సభ్యులు

ఈదురు గాలులకు పౌల్ట్రీ ఫాం ధ్వంసం

హత్నూర, జూన్ 7: మండల పరిధిలోని కొన్యాల గ్రామంలో గురువారం రాత్రి ఈదురుగాలులకు పౌల్ట్రీఫాం రేకులు ఎగిరిపోయి దూరం పడడంతో ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన బడంపేట మల్లయ్య వ్యవసాయ పొలంలో పౌల్ట్రీఫాం ఏర్పాటు చేసుకున్నారు. ఈదురు గాలులకు పౌల్ట్రీఫాం పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. వర్షానికి గోడలు కూలిపోయాయి. దీంతో రూ. లక్షల్లో నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.



గాలివానకు ఎగిరి దూరంగా పడడంతో ధ్వంసమైన పౌల్ట్రీఫాం పైకప్పు రేకులు

10న ఉపాధిహామీ రక్షణ కోసం రాష్ట్ర సదస్సు

సంగారెడ్డి రూరల్, జూన్ 7: ఉపాధిహామీ రక్షణ కోసం ఈనెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు పిలుపునిచ్చారు. సంగారెడ్డి మండలం కల్పగూర్, అంగడిపేట గ్రామాల్లో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల పోరాట ఫలితంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద వందరోజుల పని గ్యారంటీ చేస్తూ కేంద్రం చట్టం చేసిందన్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యుడు శివదాసన్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్, ఇతర ప్రముఖులు హాజరవున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, మానయ్య, జగదాంబ, చంద్రయ్య, శివయ్య, అంజయ్య, లక్ష్మీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు వెపన్ ట్రైనింగ్



గజ్వేల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు వెపన్ వినియోగంపై శిక్షణను ఇస్తున్న శిక్షకులు

గజ్వేల్, జూన్ 7: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో ఏడో రోజు ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆయుధాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచే యోగా, కవాతు, ఫైరింగ్, సిములేటర్ ఫైరింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, వెపన్ ట్రైనింగ్ తరగతులను నిర్వహించినట్లు క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు తెలిపారు. నిజామాబాద్ గ్రూప్ తలసేనా శిబిరంలో రాష్ట్రం నుంచి పాల్గొనే 75 మంది క్యాడెట్లకు అబ్స్టికిల్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజీన్, జడ్జింగ్ డిస్టెన్స్, ఫైరింగ్, టెంట్‌పిచ్చింగ్‌లలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు క్యాంపు డిప్యూటీ కమాండెంట్ కెప్టెన్ భవానీ తెలిపారు. ఆల్ఫా,బ్రావో, ఛార్లీ, డెల్టా కేటగిరీలుగా విభజించి క్యాడెట్లకు ఖోఖో, వాలీబాల్, సాంస్కృతిక పోటీలను నిర్వహించినట్లు ఎన్‌సీసీ అధికారి విజయభాస్కర్, శంకరయ్య తెలిపారు.

బదిలీలు, పదోన్నతులకు రంగం సిద్ధం

- డీహెచ్, డీఎంఈ, టీవీవీపీ అధికారులు, ఉద్యోగులకు స్థానచలనం
- సాధారణ బదిలీలు, పదోన్నతులపై త్వరలో వెలువడనున్న జీవో
- ఇప్పటికే ఆయా విభాగాల హెచ్‌వోడీలు వివరాలు సేకరణ



సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయం



డీసీహెచ్‌ఎస్ కార్యాలయం

సంగారెడ్డి అర్బన్, జూన్ 7: వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు, పదోన్నతులకు రంగం సిద్ధమైందా అంటే.. అవుననే సమాధానం ఆ వర్గాల్లో వినిపిస్తున్నది. ఎన్నికల కోడ్ ముగియగానే సాధారణ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన జీవో త్వరలో వెలువడనున్నదని తెలుస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(డీహెచ్), డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ), తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ)విభాగాల్లో పనిచేసే జిల్లా వైద్యాధికారులు, వైద్యాధికారులు, ఉద్యోగులు, వైద్య సిబ్బందికి స్థాన చలనం కలగనున్నది. ఇప్పటికే ఆయా విభాగాల హెచ్‌వోడీలు అధికారులు, ఉద్యోగుల వివరాలు సేకరించారు. బదిలీలు, పదోన్నతుల భాగంగా సంగారెడ్డి జిల్లాకు కొత్త వైద్యాధికారులు వచ్చే అవకాశం ఉంది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(డీహెచ్) పరిధిలోని వస్తే మూడేళ్లుగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డా.గాయత్రీదేవీ కొనసాగుతున్నారు. 3.4.2021న రెగ్యులర్ డీఎంహెచ్‌వోగా డా.లక్ష్మణ్‌సింగ్‌ను ప్రభుత్వం నియమించినా ఆయనకు చార్జీ ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం నిరాకరించింది. దీంతో డా.గాయత్రీదేవే అప్పటి నుంచి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్నారు. గతంలో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించడం, ఇతరత్రా ఆరోపణల నేపథ్యంలో గత మార్చిలోనే ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేట, మెదక్ జిల్లాల డీఎంహెచ్‌వోలను ఒకరోజు వ్యవధిలోనే ప్రభుత్వం బదిలీచేసింది. ఆ క్రమంలో సంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వోను కూడా మార్చుచేసి సీనియర్‌ను డీఎంహెచ్‌వో నియమిస్తారన్న ప్రచారం కూడా జోరుగా జరిగింది. ఇక డీఎంఈ పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌తో పాటు అనుబంధ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్లు కొత్తవారు వచ్చే అవకాశం ఉంది. అదనపు డీఎంఈ హోదా ఉన్నవారే ఆ పోస్టుకు అర్హులు, కాగా ప్రస్తుతం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ ఇద్దరూ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. వారి స్థానంలో కొత్తవారు రానున్నారని తెలుస్తోంది. వైద్య విధాన పరిషత్ పరిధిలో కొన్నేళ్లుగా డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న డా.సంగారెడ్డికి కూడా స్థాన చలనం తప్పనిసరి అని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్, జూన్ 7: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం గణిత శాస్త్రం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్, రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్, జహీరాబాద్‌లోని సిద్దార్థ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 150 మందికి 108 మంది హాజరుకాగా, 42 మంది గైర్హాజరయ్యారు. 72 శాతం హాజరు నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహనా సదస్సు

అక్కన్నపేట, జూన్ 7: రైతులు భవిష్యత్‌తరాలకు ఉపయోగపడే ఆయిల్ పామ్ తోటలపై అవగాహన పెంపొందించుకోవాలని అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఉల్లి బాలయ్య తోటలో మానిటరింగ్ ఆఫీసర్ విజయ్ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం సబ్సిడీపై తోటలం పెంపకం కోసం రాయితీ ఇస్తున్నదని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

'మహిళలకు ఇవ్వడం గొప్ప విషయం'

ములుగు, జూన్ 7: మహిళా సాధికారత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు పాఠశాలల యూనిఫామ్స్ కుట్టే అవకాశం కల్పించడం గొప్ప విషయమని డీపీఎం వాసుదేవ్, ఐకేపీ సభ్యులు పేర్కొన్నారు. ములుగులోని ఐకేపీ కేంద్రంలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల దుస్తులను కుట్టే పనులు అప్పగించారన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ములుగు మండల మహిళా సమైక్య ద్వారా స్కూల్ యూనిఫామ్స్ సిద్ధం చేయిస్తున్నట్లు వెల్లడించారు.

పర్యావరణాన్ని రక్షించుకోవడం మన అందరి బాధ్యత

- హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ శివరంజని



మొక్కలు నాటుతున్న మెజిస్ట్రేట్ శివరంజని

హుస్నాబాద్, జూన్ 7: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ శివరంజని అన్నారు. శుక్రవారం ఆమె హుస్నాబాద్ పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాదు వాటికి నీరు పోసి రక్షించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్‌ను వినియోగించవద్దన్నారు. పరిశుభ్రత మన ఇంటి వరకే పరిమితం కావద్దని చుట్టు పక్కలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, ఎజీపీ కన్నోజు రామక్రిష్ణ, చిత్తారి హన్మయ్య, సదానందం, సంపత్, దీకొండ ప్రవీణ్ పాల్గొన్నారు.

న్యాయశాస్త్ర పరిపాలనలో శిక్షణకు దరఖాస్తులు

● జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూన్ 7: జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్, గవర్నమెంట్ ప్లీడర్ల వద్ద జూనియర్‌గా చేర్పించి మూడేళ్ల న్యాయశాస్త్ర పరిపాలనలో స్టైఫండ్‌తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి టి.అఖిలేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికిగాను ఉమ్మడి మెదక్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థుల కోసం ఎనిమిది సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. న్యాయశాస్త్రంలో పట్టా పొంది, సంవత్సర ఆదాయం రూ.2 లక్షలకు మించకుండా, కుల, ఆదాయ, నివాసపత్రాలతో, పాటు డిగ్రీ, న్యాయశాస్త్ర విద్య పట్టాలతో, బార్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లతో జూలై 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య ప్రదాయిని.. అల్లనేరేడు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న అల్లనేరేడు పండ్లు


ఖేడ్‌లో విక్రయానికి సిద్ధంగా అల్లనేరేడు పండ్లు

● పండ్లతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు
● కిలో రూ.70 నుంచి రూ.100ల వరకు విక్రయం
● అత్యధికంగా నారాయణఖేడ్‌లో రూ.200లకు విక్రయం

సిద్దిపేట అర్బన్/నారాయణఖేడ్, జూన్ 7: అల్లనేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. ఎన్నో ఔషధ గుణాలున్న ఈ పండ్లు చూడగానే నోరూరించేలా ఉంటాయి. ప్రస్తుతం అల్ల నేరేడు ధర మార్కెట్‌లో కిలోకు రూ.70 నుంచి రూ.100 వరకు పలుకుతున్నది. ప్రొటీన్, కాల్షియం, కార్బోహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం, సోడియం, విటమిన్ సీ, థయామిన్, రైబోఫ్లావిన్, నియాసిన్, విటమిన్ బీ, విటమిన్ ఏ, ఆరోగ్యకరమైన కొవ్వుల సమ్మేళనం అయిన అల్లనేరేడు పండ్లు అనేక వ్యాధులను నియంత్రించే శక్తి కలిగి ఉంటాయి. అల్లనేరేడు పండ్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని వైద్యులు తరచూ చెబుతుంటారు.



పండ్ల వల్ల లాభాలు

అల్లనేరేడు పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని శాస్త్రీయంగా రుజువైంది. వీటిలో పొటాషియం అధికస్థాయిలో ఉంటుంది. మీ గుండె ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ ఈ పండ్లను తీసుకుంటే చాలా మేలు చేస్తుంది. అంతేకాకుండా స్ట్రోక్, హై బ్లడ్ ప్రెషర్ రాకుండా నిరోధిస్తుంది. శ్వాసనాళాలు, ఊపిరితిత్తులను శుభ్రపరుస్తుంది. విష వాయువులు, వాయు కాలుష్యం కారణంగా దెబ్బతిన్న ఊపిరితిత్తులు, శ్వాసనాళాలను శుభ్రం చేసే శక్తి అల్లనేరేడు పండ్లకు ఉంది. వాయు కాలుష్యం కారణంగా ఎదురయ్యే ఫ్రీరాడికల్స్‌ను ఇవి నియంత్రిస్తాయి. వీటిలో ఉండే జింక్, విటమిన్ సీ ఆస్తమా లక్షణాలను తగ్గిస్తాయి. కొలన్ కేన్సర్‌ను నిరోధిస్తుంది. అల్లనేరేడులో ఉండే సైనైడిన్ వంటి సమ్మేళనాలు కొలన్ కేన్సర్‌ను నిరోధించే శక్తిని కలిగి ఉంటాయి. అల్లనేరేడు పండ్లలో ఉండే యాంటాక్సిడ్లు ఫ్రీరాడికల్స్‌పై పోరాడుతాయి. కేన్సర్ కణాలు వృద్ధిని అడ్డుకుంటాయి. డయాబెటిస్‌కు చికిత్సగా అల్లనేరేడు పండ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండడానికి దోహదం చేస్తాయి. అధిక మూత్ర విసర్జన, దప్పిక వంటి డయాబెటిస్ లక్షణాలను అల్లనేరేడు పండ్లు తగ్గిస్తాయి. కొలాజెన్ పెంచుతాయి. అల్లనేరేడు పండ్లు తింటే చర్మం మిలమిల మెరుస్తుంది. వీటిలోని యాంటాక్సిడెంట్ల సమ్మేళనాలు, విటమిన్ సీ చర్మంలో కొలాజెన్ ఉత్పత్తికి దోహదం చేస్తాయి. అందుకే చర్మం యవ్వనాన్ని సంతరించుకుంటుంది. అంతేకాకుండా అల్లనేరేడు పండ్లలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. కొన్నిరకాల ఇన్ఫెక్షన్లను ఇవి అడ్డుకుంటాయి. దంతాలు, చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. అల్లనేరేడు పండ్లే కాకుండా.. ఆకులు, ఇత్తులు కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఈ పండ్లు తినడం వల్ల కడుపునొప్పితో బాధపడుతున్న వారికి ఉపశమనం లభిస్తుంది. పేగుల్లో పేరుకుపోయిన వెంట్రుకలను తొలగించే శక్తి ఉంటుంది. మూత్రంలో మంట తగ్గడానికి ఈ పండ్లు ఉపకరిస్తాయి. ఈ పండ్లను రోజుకొకటి తింటే వైద్యుల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం ఉండదని పలువురు అంటున్నారు. అలాగే నారాయణఖేడ్ మార్కెట్‌లో అల్లనేరేడు పండ్లు దర్శనమిస్తున్నాయి. సీజనల్ పండ్లు కావడంతో పాటు రుచికరంగా ఉంటాయి. ప్రస్తుతం వీటి ధర నారాయణఖేడ్ మార్కెట్‌లో కిలోకు రూ.160 నుంచి రూ.200ల వరకు విక్రయిస్తున్నారు.

కాంగ్రెస్ గెలుపుతో మార్పునకు నాంది

● కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషిచేస్తాం
● జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్


ఖేడ్‌లో విజయోత్సవ ర్యాలీలో గుర్రపు కళాకారుల నృత్యాలు

నారాయణఖేడ్, జూన్ 7: కాంగ్రెస్ గెలుపు మార్పునకు నాంది పలికిందని, కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషి చేస్తామని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట నుంచి కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు కర్నె.శ్రీనివాస్, శంకరయ్యస్వామి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్, సురేష్‌షెట్కార్ కూతుళ్లు గిరిజాషెట్కార్, శివానీషెట్కార్, సాగర్ షెట్కార్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు రషీద్ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీఎత్తున బాణసంచా కాల్చారు. ర్యాలీలో అడుగడుగునా కాంగ్రెస్ అభిమానులు సురేష్‌షెట్కార్‌ను, సంజీవరెడ్డిలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రాజీవ్ చౌక్ వద్ద క్రేన్ సహాయంతో గజమాల వేశారు. అనంతరం రాజీవ్ చౌక్ వద్ద సురేష్‌కుమార్ షెట్కార్ మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు బీఆర్ఎస్ గాలిలో గెలిచిన బీబీపాటిల్, అభివృద్ధి ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ ఓడిపోతుందని తెలిసి బీజేపీలో చేరి పోటీ చేశారన్నారు. బీజేపీ నాయకులు దేవుడిని రాజకీయాల్లోకి తెచ్చి మతం పేరిట కుట్రలు పన్ని యువతను చెడగొడుతున్నారని పేర్కొన్నారు. తాను చేసిన త్యాగాన్ని ఢిల్లీ నుంచి ఇక్కడి సాధారణ కార్యకర్త వరకు గుర్తించి సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్‌ను గెలిపించి బీజేపీకి బుద్ధి చెప్పారన్నారు. దశాబ్దకాలంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఇబ్బందులకు గురయ్యారని, తాను కాంగ్రెస్ భవిష్యత్తు, కార్యకర్తలు బాగుండాలనే లక్ష్యంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. తాను ఎంపీగా, సంజీవరెడ్డి ఎమ్మెల్యేగా అభివృద్ధి కోసం శ్రమిస్తామన్నారు. పరిశ్రమలను, విద్యాసంస్థలను ఏర్పాటు చేసి గ్రామాలు, తండాలకు అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలకు వనవాసం తప్పలేదన్నారు. తనను ఎమ్మెల్యేగా, సురేష్ షెట్కార్‌ను ఎంపీగా గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి డబుల్ ధమాక ఇచ్చిన ఘనత నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలదే అని చెప్పారు. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిపించి 2009 ఫలితాలను పునరావృతం చేశారన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా కలిసికట్టుగా పనిచేస్తామని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని వెల్లడించారు. అంతకుముందు సురేష్‌షెట్కార్, సంజీవరెడ్డిలు మంగల్‌పేట దుర్గామాత ఆలయానికి చేరుకోగానే కార్యకర్తలు ఘన స్వాగతం తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో బోరంచకు చెందిన గుర్రపు కళాకారుల నృత్యం ఆకట్టుకుంది.


ఖేడ్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

10లోగా జొన్నల కొనుగోళ్లు పూర్తిచేయాలి

● వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోవింద్ ● అల్లాదుర్గంలో జొన్నల కొనుగోలు కేంద్రం సందర్శన

అల్లాదుర్గం, జూన్ 7: జొన్నల కొనుగోలును వేగవంతం చేసి ఈనెల 10లోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోవింద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అల్లాదుర్గంలోని రైతువేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో తూకం వేయని జొన్నల నిల్వలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. 148 మంది రైతులకు సంబంధించిన జొన్నల బస్తాలు తూకం వేయాల్సి ఉండగా, వీటిలో 50 మంది రైతులకు సంబంధించిన జొన్నల బాస్తాలను తూకం వేశామని పీఏసీఎస్ కార్యదర్శి శివ్వాగౌడ్ డీఏవోకు వివరించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా జొన్నల కొనుగోలును త్వరతగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఏడీఏ రాంప్రసాద్, స్థానిక ఏవో రాజేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.


అల్లాదుర్గంలోని రైతువేదికలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఏవో గోవింద్

చెట్టును ఢీకొన్న బైక్, వ్యక్తి మృతి


మల్లేశం(ఫైల్)

కౌడిపల్లి, జూన్ 7: బైక్ అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని బట్టిమ్మ ఆలయం సమీపంలో శుక్రవారం జరిగింది. మృతుడి కుటుంబీకుల తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండల కేంద్రానికి చెందిన మంగళి మల్లేశం(34) తన ద్విచక్ర వాహనంపై సొంత పనుల నిమిత్తం కౌడిపల్లి మండల కేంద్రానికి వెళ్లాడు. పనులు ముగించుకున్న అనంతరం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. కౌడిపల్లి శివారులోని బట్టిమ్మ ఆలయం సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో మల్లేశం తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడు కొంతకాలంగా ఓ దినపత్రికలో జర్నలిస్టుగా విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

● రెండు నెలల కిందట చనిపోయినట్లు గుర్తింపు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రంజిత్

రామాయంపేట, జూన్ 7: పట్టణంలోని బీసీ కాలనీ గుట్ట సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. సుమారు 40 ఏళ్ల పైబడి ఉన్న మృతదేహం, కుళ్లిపోయి అస్థిపంజరంగా లభ్యమైంది. శుక్రవారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన పలువురు గమనించి పోలీసులకు సమాచారమందించారు. ఎస్ఐ రంజిత్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సదరు వ్యక్తి రెండునెలల క్రితం చనిపోయి ఉంటాడని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం అస్థిపంజరాన్ని అక్కడే గొయ్యి తవ్వి పాతిపెట్టారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి గల్లంతు

తూప్రాన్, జూన్ 7: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో మునిగి గల్లంతయ్యాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలోని కొత్త చెరువులో శుక్రవారం చోటు చేసుకున్నది. సంగారెడ్డికి చెందిన నర్సింహులు(50) కత్తులకు పదును పెడుతూ జీవనం సాగిస్తుంటాడు. కొంతకాలంగా తూప్రాన్ నివాసముంటున్నాడు. తూప్రాన్‌కు చెందిన మరో ఇద్దరు టేకు పోచయ్య, జెడిగాడి దేవందర్‌లతో కలిసి నర్సింహులు చేపలు పట్టేందుకు కొత్తచెరువుకు వద్దకు వెళ్లారు. చెరువులో గాలం వేయగా జారిపోవడంతో.. తీసేందుకు దిగిన నర్సింహులు మునిగిపోయాడు. ఈ విషయాన్ని మిగతా ఇద్దరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చేపట్టారు.

అట్టహాసంగా ఆలయాల వార్షికోత్సవం


బోనాలు తీస్తున్న గిరిజన మహిళలు

నారాయణఖేడ్, జూన్ 7: మండల పరిధిలోని చల్లగిద్దతండాలో శుక్రవారం త్రయాహ్నిక జగదాంబ సేవాలాల్, రాంరావ్ మహరాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, హోమం, అలంకరణ, మహాహారతి, గిరిజన సంప్రదాయంలో భోగ్ భండార్ కార్యక్రమాలను పురోహితుడు మోహన్‌జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం పల్లకీసేవ, బోనాల ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చాందిబాయిరాంచందర్, తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, తండా వాసులతో పాటు చుట్టుపక్కల తండావాసులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో ఘనంగా కట్ట మైసమ్మ పండుగ

పెద్దశంకరంపేట, జూన్ 7: పెద్దశంకరంపేట పట్టణ సమీపంలో ఉన్న కట్టమైసమ్మ పండుగను శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం సరస్వతీ శిశుమందిర్ నుంచి అమ్మవారికి పూజా సామగ్రిని శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో తీసుకెళ్లారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, గ్రామ పెద్దలు కిష్టారెడ్డి, గంగారెడ్డి, సర్వేశ్వర్, మిథున, రమేష్, ఆయాఅ కులసంఘాల పెద్దలు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.


పెద్దశంకరంపేటలో కట్ట మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

గ్రామాల్లో ముమ్మరంగా 'బడిబాట'



సంగారెడ్డిఅర్బన్: నేతాజీనగర్‌లో విద్యార్థులతో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే ఉద్దేశంతో అమలు చేస్తున్న బడిబాట కార్యక్రమం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శుక్రవారం ముమ్మరంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి సర్కారు బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్, జూన్ 7: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డిలోని నేతాజీనగర్‌లో శుక్రవారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తూ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ఇంటింటి సర్వే చేసి పిల్లల వివరాలు నమోదు చేశారు. బడిబయట పిల్లలందర్నీ బడిలో చేర్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సంగారెడ్డి మండలంలోని కల్పగూర్ గ్రామంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు.



జహీరాబాద్: రాయిపల్లి తండాలో బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు



నిజాంపేట: నందిగామలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందం



రేగోడులో బడిబాట ర్యాలీ

● **జహీరాబాద్:** జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో బడిబాట ముమ్మరంగా కొనసాగుతుంది. ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉపాధ్యాయులు విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. ఓవైపు అమ్మ ఆదర్శపాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలు, మరోవైపు బడిబాటను విజయవంతానికి ఆయా శాఖల అధికారులు విస్తృతంగా కృషి చేస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల విద్యాధికారి బస్వరాజ్ పంచాయతీ రాజ్ ఏఈ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **జిన్నారం:** మండలంలోని బొల్లారం, కొర్లకుంట, మంత్రికుంట, ఊట్ల, అందూరు, కొడకంచి, మంగంపేట, మాదారం, చెట్లపోతారం, నల్తూరు, శివానగర్, అల్లీనగర్ తదితర గ్రామాల్లో శుక్రవారం బడిబాటను విస్తృతంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లితండ్రులను ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కలిసి సర్కారుబడుల్లో విద్యార్థులను చేర్పిస్తే కల్పించే ప్రయోజనాల గురించి వివరించారు.

● **నిజాంపేట:** మండలం కేంద్రంతో పాటు నందిగామ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడుతూ సర్కారు బడిలో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి భవిష్యత్తుకు బాటలు వేస్తామని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రాజేందర్, కార్యదర్శులు ఆరిఫ్ హుస్సేన్, నర్సింహులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, అంగన్‌వాడీలు, మహిళాసంఘాలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● **చేగుంట:** మండల పరిధిలోని పొలంపల్లి, కర్నాల్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం విద్యార్థులు ఉపాధ్యాయులు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిట్టబోయిన సత్యనారాయణ, కర్రే సిద్దిరాములు, ఉపాధ్యాయులు కవిత, సంపత్, సుమలత, భగ్యమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు మమత, కార్యదరులు జగదీష్, సురేష్, అమ్మ ఆదర్శ కమిటీ, మహిళ సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **రేగోడు:** రేగోడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

● **మాసాయిపేట:** మండలంలో బడిబాట కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. శుక్రవారం వివిధ గ్రామాల్లో మాసాయిపేట కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సమిత శంకర్‌బాబుతో పాటు ఇతర ఉపాధ్యాయులు బడి బయట ఉన్న పిల్లల తల్లిదండ్రులను కలుస్తూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

●**వెల్దుర్తి:** బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వెల్దుర్తి ఇంచార్జి ఎంపీడీవో, ఎంపీవో విఘ్నేశ్వర్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామంలో వెల్దుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీని నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్చన, భిక్షపతి, సాయిరాం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహార జాగ్రత్తలు పాటించాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మనుజ

మునిపల్లి, జూన్ 7: గర్భిణులు, బాలింతలు ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మనుజ అన్నారు. శుక్రవారం మునిపల్లి పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనుజ మాట్లాడుతూ ప్రతి సోమ, శుక్రవారాల్లో మునిపల్లి ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పుట్టే బిడ్డ ఆరోగ్యంగా, ఎటువంటి సమస్యలు లేకుండా జన్మిస్తారని వివరించారు. గర్భిణులను ఆసుపత్రికి తీసుకువచ్చి, ఇళ్లకు తీసుకెళ్లే వరకు ఆశావర్కర్లే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రజలే తగిన బుద్ధి చెప్పారు

● కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ పాండు

మునిపల్లి, జూన్ 7: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో భాగంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధి చెప్పి జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేశారని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు, పెద్దగోపులారం ఎంపీటీసీ బుర్కల పాండు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో ఆయన స్థానిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో సురేష్ షెట్కార్ గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం పని చేసిన ప్రతీ కార్యకర్తకు రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ అండగా ఉంటారన్నారు.

డీఈవో కార్యాలయం ఎదుట డీవైఎఫ్ఐ ధర్నా



డీఈవో కార్యాలయంవద్ద డీవైఎఫ్ఐ నాయకుల ధర్నా

సంగారెడ్డి రూరల్, జూన్ 7: ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయం ముందు డీవైఎఫ్ఐ నాయకులు ధర్నా చేశారు. అనంతరం డీఈవో అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి యాజమాన్యం అండ

● రూ.22.50లక్షలు ఇచ్చేందుకు అంగీకారం



మృతుడి కుటుంబానికి రూ.లక్ష అందజేస్తున్న యూనివర్సిటీ యాజమాన్యం

మునిపల్లి, జూన్ 7: మండలంలోని కంకోల్ గ్రామ శివారులో గల వోక్సాన్ యూనివర్సిటీలో అనుమానాస్పదంగా మృతి చెందిన సంగమేశ్వర్ కుటుంబానికి ఆర్థికసాయం అందించేందుకు యూనివర్సిటీ యాజమాన్యం అంగీకరించింది. యూనివర్సిటీలో అదృశ్యమై సదాశివపేట మండలం గంగకత్వవాగులో శవమై తేలిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబీకులు, బంధువులతోపాటు అఖిల పక్ష నాయకులు మూడు రోజులుగా ఆందోళన చేపట్టారు. దీంతో యూనివర్సిటీ యాజమాన్యం దిగివచ్చి మృతుడి కుటుంబానికి రూ. 22.50లక్షలు సహాయం చేసేందుకు అంగీకరించింది. అంతేకాకుండా అంత్యక్రియల కోసం రూ.లక్ష నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో సంగమేశ్వర్ కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు, సీపీఎం జిల్లా కార్యదర్శి జి. జయరాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్, సీపీఎం మండల నాయకుడు రమేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. కాగా వోక్సాన్ యూనివర్సిటీలో నాలుగేళ్లుగా గార్డెన్ వర్కర్‌గా పని చేసి మృతి చెందడం పట్ల యూనివర్సిటీ యాజమాన్యం శుక్రవారం సంతాపం తెలిపింది. బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా ఆర్థిక సహాయం అందించినట్లు యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు.

బ్రాహ్మణసమాజం సేవాసంస్థ కార్యవర్గం ఎంపిక



బ్రాహ్మణ సేవాసంస్థ నూతన బాధ్యులను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

పెద్దశంకరంపేట, జూన్ 7: నారాయణఖేడ్ నియోజకవర్గం బ్రాహ్మణ సమాజ సేవాసంస్థ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పెద్దశంకరంపేటలోని శివాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గం బ్రాహ్మణ సమాజ సేవాసంస్థ అధ్యక్షుడిగా కిషన్‌రావు దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్దశంకరంపేట బ్రాహ్మణ సమాజ సేవాసంస్థ నూతన అధ్యక్షుడిగా ఆసూరి రామచంద్రచారి, ప్రధాన కార్యదర్శిగా జూకల్‌కర్ రాము, గౌరవ అధ్యక్షుడిగా గుడి చంద్రశేఖర్ శర్మ, ఉపాధ్యక్షులుగా అనంతరాజశర్మ, సీతారామారావు దేశ్‌పాండే, సహాయ కార్యదర్శిగా గుడి సంతోష్, గిరిధర్‌రావు, సలహాదారులుగా అభిలాష్‌శర్మ, కోశాధికారిగా రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా మహేష్ శర్మ, క్రాంతి, ఫణిందర్, జగన్నాథరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన మహిళా కార్యవర్గం

పెద్దశంకరంపేట మహిళాకార్యవర్గ బ్రాహ్మణ సమాజ సేవా సంస్థ అధ్యక్షురాలిగా వాసుకి, ఉపాధ్యక్షులుగా విద్యపాటిల్, గౌరవ అధ్యక్షురాలుగా లక్ష్మి, రేఖ, ప్రధాన కార్యదర్శిగా కిరణ్మయి, సంయుక్త కార్యదర్శిగా శ్రీవేణి, కార్యదర్శులుగా హేమలత, సుజాత ఎంపికయ్యారు.

నస్కల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిజాంపేట, జూన్ 7: మండల పరిధిలోని నస్కల్ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తరువాత కలుసుకున్నందున ఆత్మీయంగా పలకరించుకుని పరస్పర యోగక్షేమాలను తెలుసుకున్నారు. గత స్మృతులను నెమరువేసుకుంటూ రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. నాటి గురువులు భాస్కర్, లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించారు.



నస్కల్ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

దివ్యాంగులకు వీల్‌చైర్‌ల పంపిణీ



దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చిన్నశంకరంపేట, జూన్ 7: మండలంలోని గజగట్లపల్లి, ఖాజాపూర్ తండాకు చెందిన దివ్యాంగులకు శుక్రవారం భార్గవ్ ఆర్యన్ మేక్ చేంజ్ సహకారంతో సానిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివ, భాను, సూర్య, సురేష్ పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

మునిపల్లి, జూన్ 7: ఈ నెల 10వ తేదీన ఎంపీపీ శైలజ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డాక్టర్ హరినందన్ రావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఆయా శాఖ అధికారులు, సభ్యులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

11న నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, జూన్ 7: నారాయణఖేడ్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 11న ఉదయం 11 గంటలకు ఎంపీపీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ చాందిబాయి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

రేగోడ్‌లో మురికి కాలువ నిర్మాణం

రేగోడు జూన్ 7: మండల కేంద్రంలోని హనుమాన్ మందిరం వద్ద ఎట్టకేలకు మురికి కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. హనుమాన్ ఆలయం వద్ద మురికి కాలువ ధ్వంసం కావడంతో పూర్తిగా తొలగించి నెలలుగా అలాగే వదిలేశారు. అప్పటినుంచి పనులు చేపట్టకపోవడంతో గుంతగా మారి ప్రజలకు, వాహనాలకు ప్రమాదకరంగా మారింది. గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. ఎట్టకేలకు శుక్రవారం హనుమాన్ ఆలయం వద్ద మురికి కాలువ పనులను ప్రారంభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్యాధికారుల సమీక్షలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



ఎంసీహెచ్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మైనంపల్లి

మెదక్ అర్బన్, జూన్ 7: జబ్బు పడ్డ ప్రతీ వ్యక్తికి ఉచితంగా ప్రభుత్వ వైద్యం అందాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. వర్షా కాలం ప్రారంభమవుతున్నందున జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి వ్యాధుల సోకే ప్రమాదం ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరీక్షలు జరిపించాలన్నారు. తన సొంత ఖర్చులతో జిల్లా ఆసుపత్రికి అంబులెన్స్ కేటాయిస్తానన్నారు. మందుల కొరత లేకుండా అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రతీ దవాఖానలో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రతను పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రాలను పూర్తి చేయాలని, మండలాలవారీగా వైద్యాధికారులతో ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎంసీహెచ్ ఆసుప్రతి తనిఖీ..

జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని, ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య చికిత్స అందించాలని, వైద్యులకు సూచించారు. ఆయన వెంట జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డా. శ్రీరామ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. చంద్రశేఖర్. మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో కురుస్తున్న వర్షం

వెల్దుర్తిలో వర్షం...చల్లబడిన వాతావరణం

వెల్దుర్తి, జూన్ 7: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం ఒక మోస్తరు వర్షం కురిసింది. ఉక్కపోతతో తల్లడిల్లుతున్న ప్రజలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఉపశమనం లభించినట్టయ్యింది. సాగుకు సమాయత్తమైన రైతులు కురిసిన వర్షంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతాయారు

జిన్నారం, జూన్ 6: బొల్లారం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతాయారు దుస్తులు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికుల సేవలు విలువైనవని, స్వచ్ఛత, పరిశుభ్రత నిర్వహణలో వారి సేవలు మరువలేనివని ప్రశంసించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన నీలం మధు



దీపాదాస్ మున్షీతో నీలం మధు, నల్గొండ, భువనగిరి ఎంపీలు

పటాన్‌చెరు రూరల్, జూన్ 7 : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం నల్గొండ, భువనగిరి పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డిలతో కలిసి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తున్న యువనేత నీలం మధును ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దానం నాగేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఖైరతాబాద్ డీసీసీ ప్రెసిడెంట్ రోహిన్‌రెడ్డి, బాబా ఫసియోద్దీన్ పాల్గొన్నారు.

నేడు చేప ప్రసాదం పంపిణీ

సదాశివపేట, జూన్ 7: మృగశిర కార్తె పురస్కరించుకొని ఈ నెల 8న మండలంలోని నిజాంపూర్ గ్రామంలో ఉదయం 7 గంటల నుంచి ఉచితంగా చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు ఆడెం మనోహర్ సోదరులు శుక్రవారం తెలిపారు. గత వందేళ్లుగా ఆడెం కుటుంబ సభ్యులు చేప ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. దగ్గు, ఆస్తమా రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఏటా తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి ప్రజలు వచ్చి వచ్చి చేప ప్రసాదాన్ని తీసుకుంటారని తెలిపారు. గత 45 ఏళ్లుగా ఇప్పటివరకు 3లక్షల మందికి ఉచితంగా చేప మందును అందించిన ఆడెం మనోహర్ సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డును ఈ నెల 8న అందజేయనున్నట్టు ఆ సంస్థ చీఫ్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ తెలిపారు.

విమర్శలు కాదు.. నిధులు తెండి

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జూన్ 7: అధికారపార్టీ నాయకులు తనపై వ్యక్తిగత విమర్శలుమానుకుని నియోజకవర్గానికి నిధులు తెచ్చి సత్తా చూపాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులకు తనను విమర్శించడానికి ఏమి లేక పార్టీ మారానని అనడం తప్ప మరో విషయం మాట్లాడటం లేదని విమర్శించారు. తాను ఐదేళ్ల క్రితం పార్టీ మారానని ఏ పార్టీలో ఉన్నా చిత్తశుద్ధితో పార్టీ కోసం పనిచేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇతరులను విమర్శించేముందు తమ పక్కన కూర్చుండే నాయకులు ఎన్ని పార్టీలు మారారో చూసుకోవాలన్నారు. మరో సారి తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఏది ఏమైనా ప్రజల తీర్పును గౌరవిస్తామని, ఎంపీగా గెలుపొందిన రఘునందన్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం వల్లనే గెలిచారని కాంగ్రెస్ నాయకులు అనడం హాస్యాస్పదమని, బీఆర్ఎస్‌ను ఓడించేందుకే కాంగ్రెస్‌నాయకులు బీజేపీతో కలిశారని సునీతారెడ్డి విమర్శించారు. కాగా నర్సాపూర్ నియోజకవర్గానికి గత ప్రభుత్వంలో మంజూరైన ప్రత్యేక నిధులు రద్దు అయి పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయని, చిత్తశుద్ధి ఉంటే ఆ నిధులు తిరిగి తీసుకురావాలని కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఎలాంటి ఉపయోగం లేని విమర్శలు మాని ప్రభుత్వంలో ఉన్నందున ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేయాలన్నారు. కాగా ప్రతి శుక్రవారం ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి నర్సాపూర్‌లో అందుబాటులో ఉంటానని సునీతారెడ్డి పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమోద్దీన్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలతోనే గుర్తింపు: ఎంపీపీ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మంజుల

కొల్చారం, జూన్ 7: పదవీ కాలంలో చేసిన సేవలే చిర కాలం గుర్తింపును ఇస్తాయని కొల్చారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కొరబోయిన మంజులాకాశీనాథ్ పేర్కొన్నారు. కొల్చారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ మంజుల అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం జడ్పీటీసీ మత్యంగారి మేఘమాల సంతోష్‌కుమార్, ఎంపీపీ మంజుల ఐదేళ్ల పదవీకాలంలో తమ అనుభవాలు, సేవలను అధికారులతో పంచుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహులు, డిప్యూటీతహసీల్దార్ నాగవర్ధన్, కొల్చారం మెడికల్ ఆఫీసర్ రమేష్‌నాయక్, ఏవో శ్వేతకుమారి, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు ఉదయ వేమారెడ్డి, ఎంపీటీసీలు భాగ్యలక్ష్మి సిద్దిరాములు, మమత యాదగిరి, ఏఈలు ఇర్ఫాన్ హుస్సేన్, శ్రీకాంత్, హైమద్‌అలీ, ఏపీవో మహిపాల్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం సుశీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనరసమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



తూప్రాన్‌లో విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

తూప్రాన్, జూన్ 7: తూప్రాన్ పట్టణంలోని విత్తన దుకాణాలను శుక్రవారం పోలీసులు, వ్యవసాయ అధికారులు తనిఖీలు చేశారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం, తూప్రాన్ మండల వ్యవసాయ అధికారి గంగుమల్లులు విత్తన దుకాణాలకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. దుకాణాల్లో స్టాక్‌లు, బిల్లు బుక్కులు పరిశీలన చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విక్రయాలకు సంబంధించిన రసీదులను రైతుల అందజేయాలని సూచించారు. రైతులు రసీదులు, విత్తన పాకెట్లు, విత్తనాల బస్తాను పంట ముగిసే వరకు ఉంచుకోవాలన్నారు.

● **హవేళిఘణపూర్:** మండలంలోని పలు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి నాగమాధురి విత్తనాలు, ఎరువుల విక్రయాల షాపులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది, ఏఈవోలు పాల్గొన్నారు.

● **చిన్నశంకరంపేట:** మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫర్టిలైజర్ షాపులను ఏవో ప్రవీణ్ తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే షాపుల లైసెన్సులు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

● **చేగుంట:** మండలంలోని పలు విత్తన షాపులను రామాయంపేట ఏడీఏ వసంత సుగుణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు అనుమతి పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

● **నర్సాపూర్:** పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం తనిఖీ చేసింది. ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, నకిలీ విత్తనాలు, అధిక ధరలకు విక్రయిస్తున్న విషయమై ఆరా తీశారు.

● **పాపన్నపేట:** మండలకేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్ఐ నరేష్, వ్యవసాయాధికారి క్రిష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు, డీలర్లు ఉన్నారు.

● **జహీరాబాద్:** ఎరువులు, విత్తనాల విషయంలో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏవోలు ప్రవీణ, వినోద్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయాశాఖ ఏవో ప్రవీణ నేతృత్వంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణదారులు ఇబ్బంది పెడితే రైతులు తమను సంప్రదించాలన్నారు. మండల కేంద్రమైన మొగుడంపల్లిలో వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్ నేతృత్వంలో తనఖీ చేశారు. దుకాణాల నిర్వాహకులు విక్రయాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదుచేసుకోవాలన్నారు.